# జీవించు – నేర్చుకో – అందించు

(ఆధునిక తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి స్వతంత్ర కొటేషన్స్)

తుమ్మేటి రఘోత్తమరెడ్డి

ఎమెస్కో

# స్వతంత్ర నిర్వచనాలు

**కా**లక్రమంలో లోకాన్ని, జీవితాన్ని నిశితంగా పరిశీలించినవాళ్లు కొన్ని సాధారణీకరణాలు చేస్తారు. అవి సామెతలై ప్రజల నోళ్లలో నానతాయి. అట్లాగే కవులు కథా సందర్భంలో సాధారణీకరణాలు చేస్తారు. అవి కూడా సూక్తులైపోతాయి. అయితే వీటన్నిటికీ సందర్భం తప్పనిసరి. ఆ సామెత, ఆ సూక్తి ఏర్పడే సందర్భం ఉన్నట్లే ఆ తర్వాత దాన్ని ఉపయోగించే సందర్భమూ ఉంటుంది. సందర్భాలు అనంతవిధాలు. అట్లాగే సూక్తులు కూడా. సమాజంలో మనుషులు కూడా ఎంతమంది ఉంటే అన్నిరకాలు. కొన్ని వర్గీకరణలు సాధ్యమైనప్పటికీ, నూటికి నూరుపాళ్లు ఇద్దరు మనుషులు ఒకేవిధంగా ఉండటం సాధ్యంకాదు. మనుషులు ప్రపంచవ్యాప్తంగా దేశ, కాల, లింగ, జాతి, మత, కుల, వృత్త్యాదుల పరంగా వర్గాలుగా విభాజితమై ఉన్నారు. మనిషి స్వరూపస్వభావాల్ని నిర్ణయించేది ప్రధానంగా వాళ్లు పుట్టి పెరిగిన పరిసరాలు. అవే వారిచుట్టూ ఉన్న సమాజం పట్ల వాళ్లకు అవగాహనలు ఏర్పరుస్తాయి. అందుకే మనం సామెతలను పరిశీలించినప్పుడు పరస్పరవిరుద్ధమైనవి, విభిన్న వర్గాలను కించపరిచేవి ఎన్నో కనిపిస్తాయి. ఇప్పుడు మనమున్న సమాజంలో వాటిలో ఎన్నిటినో వాడడం అభ్యంతరకరంగా ఉంటుంది. అంటే గతకాలంలో అవి ఏర్పడినప్పుడు ఉన్న అవగాహనకూ కాలాంతరంలో ఏర్పడ్డ అవగాహనకూ భేదం ఏర్పడిందని అర్థం.

రచయితలు తమ రచనా సందర్భాల్లో వివిధ నిర్వచనాలనూ, సాధారణీకరణలనూ చేయడం సహజమే. వ్యక్తి వివేకం సామూహిక వివేకంగా మారిన సందర్భం ఇది. వ్యక్తి చెప్పిన వాక్యమైనా, సమూహం అంగీకరించి స్వీకరించినదన్నమాట.

ఈ పుస్తకం స్వభావరీత్యా కొంత భిన్నమైనది. ఈ పుస్తకమూ నిర్వచనాలే ఇస్తున్నది. భేదమేమిటంటే దీనికి ప్రత్యేక సందర్భం లేకపోవడం, ఏకవ్యక్తి వివేకం

కావడం. బహువ్యక్తుల, బహుకాలాల, దేశ, ప్రాంతాల నిర్వచనాలకూ, ఏకవ్యక్తికమైన దీనికీ భేదం స్పష్టంగా గుర్తించదగిందే. వస్తువైవిధ్యం రెండింటిలోనూ ఉన్నప్పటికీ ఏకవ్యక్తికమైన దానిలో ఏకరూపమైన ఆలోచనాధార ఉంటుంది. ఒక వ్యక్తి తన దృష్టిపథంలోకి వచ్చిన వివిధ అంశాలను సాధారణీకరణం చేస్తున్నాడు. అట్లా చేయడంలో వ్యక్తిగతమైన నైతికత, అభిప్రాయాలు ప్రధానమై సాధారణికతకు కొన్ని పరిమితులేర్పడతాయి. ఆ పరిమితుల్లో నుంచే ఈ నిర్వచనాలను అర్థం చేసుకోవలసి ఉంటుంది. సమానధర్ములైన వారికి ఇబ్బంది ఉండదు, విషమధర్ములైన వారికే సమస్య.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి జనజీవన సంక్లిష్టతలను తన దృక్కోణంలో చక్కగా అర్థం చేసుకున్న రచయిత. కథా రచన ద్వారా సమాజం పట్ల తన అవగాహనను స్పష్టీకరించిన రచయిత. సృజనాత్మక రచయిత మానవజీవితంలోని వివిధ కోణాలను తన రచనల్లో ప్రదర్శిస్తాడు. తనకు సమస్యలుగా భాసించిన వాటిని పాఠకుల ముందు పెడతాడు. వాటికి పరిష్కారాలు సూచించవచ్చు కూడా. కాని ప్రతి సమస్యనూ, ప్రతి పరిష్కారాన్నీ సృజనాత్మక రచనారూపంలో రూపుదిద్దడం ఏ రచయితకూ సాధ్యం కాదు.

బహుశా ఈ కారణం వల్లే కావచ్చు రఘోత్తమరెడ్డి మరో మార్గం ఎంచుకున్నాడు. సూటిగా తన దృష్టిపథంలోని అనేకానేక విషయాలను సాధారణీకరించి నిర్వచనాల రూపంలో అందించే ప్రయత్నం చేశాడు. ఎందరో రచయితలు, మేధావులు, మహాత్ములు సుదీర్ఘచరిత్రలో మనకు వదిలిపెట్టి వెళ్లిన తమ వివేక సంపదను తానొక్కడే తన ఆలోచనాపథం నుండి సృష్టించి నిర్మించే ప్రయత్నం చేశాడు. ఈ పుస్తకానికి ఆయన పెట్టిన పేరు 'జీవించు–నేర్చుకో–అందించు.' వాస్తవానికి మానవ వికాసమే ఈ పద్ధతిలో జరిగింది. ఇదొక అనివార్య సూత్రం.

ఈ పుస్తకం నుండి నేర్చుకోవలసింది ఎంతో ఉంది. నేర్చుకుని జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి. తరువాతి కాలానికి ఆ వివేకాన్ని అందించాలి. ఇది రచయిత ఆకాంక్షే కాదు, మా ఆకాంక్ష కూడా

**సంపాదకుడు**

# కొటేషన్స్ రచనానేపథ్యం

'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం' అనే కొటేషన్ (సూక్తి) మా ఇంటి దూలం పక్కన చాక్‌పీసుతో రాసి ఉండటాన్ని నేను చదివాను. అప్పుడు నా వయసు ఏడు సంవత్సరాలు కావచ్చు. నేను రెండో తరగతిలో ఉండి ఉండవచ్చు. రాసిన వారెవరో ఆ కొటేషన్ రచయిత పేరు రాయలేదు. నాకంటే ఆరేండ్లు పెద్దదైన మా అక్కయ్య రాసి ఉండవచ్చు. అడగడానికి మా అక్కయ్యలేదిప్పుడు. అడగాలని నాకపుడు తెలియదు. మరో నలభైఏడు సంవత్సరాల తరువాత, నేను కొటేషన్స్‌ని అధ్యయనం చేస్తున్నప్పుడు, అది సంస్కృత మహాకవి కాళిదాసు కొటేషన్ అని తెలిసింది.

భూమిలో పడ్డ విత్తనం తీరుగా – ఆ కొటేషన్ నా మనసులోపడ్డది అర్థమయీ కానట్టు – బోధపడీ పడనట్టు. దాని అర్థం ఏమిటో పూర్తిగా తెలుసుకోవాలనే జిజ్ఞాస నాలో ప్రారంభమైంది. దాని అర్థం గురించి నేనెవరినీ అడగలేదు. వయసు పెరుగుతున్నకొద్దీ, జీవితానుభవాలు కలుగుతున్నకొద్దీ, జీవితాన్ని గమనిస్తున్నకొద్దీ ఆ కొటేషన్ రోజూ నా కేదో బోధిస్తున్నట్టుగానే ఉండేది. శరీరం – ఆరోగ్యం – తిండి – వ్యాయామం వంటి విషయాలే కాదు, శరీరానికీ, జీవితానికీ ఉండే సంబంధం ఎటువంటిదో, అటువంటి శరీరాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో, దానికోసం ఏమి చెయ్యాలో, ఏమి చెయ్యకూడదో నిత్యం నాకేదో ఎరుక పరుస్తున్నట్టుగా ఉండేది. ఆ కొటేషన్ చిన్నదేకాని, మొత్తం జీవితం పొడుగునా నన్ను చైతన్య పరుస్తూ వస్తూనే ఉంది. అది మొదలు నాకు కనిపించిన ప్రతి కొటేషన్‌నీ చదువుతూ వచ్చేవాణ్ణి. నాకు సాహిత్యం పట్ల – ఆసక్తి ఆ కొటేషన్‌తోనే ప్రారంభమైందని చెప్పాలి. అయితే అటువంటి కొటేషన్లని రాస్తానని కాని, రాయాలని కాని నేను ఏ నాడూ అనుకోలేదు.

2009 మధ్యభాగంలోనే ఆంధ్రజ్యోతి దినపత్రిక వివిధ (సాహిత్యం పేజి) లో 'సెజ్' అనే ఆశుకథని డి.వి.డి. లోంచి రాసుకుని అచ్చువేసారు.

**అంకితభావం**

ఉద్యోగాన్ని అంకితభావంతో చెయ్యడం మంచిదేకాని, ఉద్యోగం కోసం జీవితాన్నే అంకితం చేయడం మంచిదికాదు.

**అఖండదీపం**

అఖండదీపాన్ని అయినా సరే, ఎవరో ఒకరు వెలిగించాల్సిందే.

**అంగలార్చడం**

ప్రేమకోసం అంగలార్చడం, తమనితాము దిగజార్చుకోవడమే.

**అంగీకారం**

అనివార్యమైతే తప్ప, అంగీకరించకూడదు.

**అంచనా**

అంత్యక్రియలకు హాజరైనమందిని చూసి, చనిపోయిన వారిని అంచనా వేయకూడదు.

తమకు తాము వేసుకునేది, అసలైన అంచనా.

తల్లిదండ్రుల శరీర స్థితుల్ని చూసికూడా, వధూవరుల భవిష్య శరీరస్థితుల్ని అంచనా వేసుకోవచ్చు.

**అంతరం**

చెప్పేదానికి, చేసేదానికీ అంతరం మంచిది కాదు.

**అంతరంగం**

అంతరంగం నలుపు అయినవారికి, గెలుపు ఎన్నటికీ సాధ్యం కాదు.

అంతరంగంలో మాలిన్యం లేనివారికి, ఆరోగ్యం ఎక్కువ.

అంతరంగాన్ని దాచుకునే వారి ముందు, అందరూ దాపరికాన్ని పాటిస్తారు.

అంతరంగాలను ఆవిష్కరించే రచయితల్ని, పాఠకులు ఇష్టంగా చదువుతారు.

అంతరంగాలు వేరుపడినా కొద్దీ, బహిరంగ జీవితాలూ వేరుపడతాయి.

మలినాంతరంగాలు, మందిలో వ్యక్తం కావు.

మాటల మధ్య అంతరంగం ధ్వనిస్తూ ఉంటుంది.

సముద్రాన్ని చూస్తుంటే, అంతరంగాన్ని చూస్తున్నట్టుంటుంది.

**అంతరాత్మ**

అంతరాత్మని అణచగలరుకాని, చంపుకోలేరు.

అంతరాత్మను అణచుకోవడానికి, మద్యపానాన్ని ఆశ్రయిస్తుంటారు.

అంతరాత్మను చంపుకున్నాకొద్దీ, ఆత్మక్షోభ అధికమవుతుంది.

అంతరాత్మను వినేవారికి, ఆత్మవిమర్శ అనవసరం.

పాలకవర్గ మేధావులకు, అంతరాత్మల్లో ప్రజలుండరు.

**అంతర్వాణి**

అంతర్వాణి అందరినీ హెచ్చరిస్తుందికాని, చాలా మంది దాన్ని వినిపించుకోరు.

**అంతిమం**

అంతిమంగా ఏం జరుగుతుందో తెలుసుకాని, చెప్పడానికి మాత్రం ఎవరూ మిగలరు.

**అందం**

అందం, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది.

అందం, నిజంగానే అద్భుతమైనది. సంస్కారం తోడైతే మహాద్భుతం!

అందం ఆకర్షించినా, ఐక్యానికి ప్రాతిపదిక తత్త్వమే అవుతుంది.

అందం ఆత్మవిశ్వాసాన్ని కలిగించేది ఎంత నిజమో, అహంకారాన్ని కలిగించేదీ అంతే నిజం.

అందం గర్వాన్ని కలిగిస్తే, కళావిహీనంగా కనిపిస్తారు.

అందంగా లేనివారు, అలంకరణలో జాగ్రత్తలు తీసుకోవాలి.

అందం పుట్టుకతో వచ్చినా, ఆత్మసౌందర్యాన్ని సాధించుకోవచ్చు.

అందగర్వం లేనివారు, మరింత అందంగా తోస్తారు.

అందమైనవన్నీ, ఆకర్షింపజేస్తాయి.

అందానికి తోడు ఆత్మసౌందర్యాన్ని చేకూర్చుకుంటే, అందం మరింత శోభిస్తుంది.

అందానికి సజ్జనులు ముగ్ధులైతే, దుర్జనులు నాశనం చెయ్యాలనుకుంటారు.

అందానికి స్త్రీ ప్రతీక అనేవారు, మర్మాంగాలతో ఆలోచిస్తారు.

అందాలను అందరూ ఆస్వాదిస్తారుకాని, ఆలోచనాపరులు వాటి తత్త్వాలను కూడా చూస్తారు.

ఆత్మసౌందర్యం గొప్పదని చెప్పడం కోసం, శరీర సౌందర్యాన్ని కించపరచనక్కరలేదు.

ఆరోగ్యవంతమైనదే, కడు అందమైనది.

ఉన్న అందాన్ని కూడా, తీర్చిదిద్దుకోవచ్చు.

క్రమంగా అందం క్షీణించినా, ఆత్మసౌందర్యం వికసిస్తూ ఉంటుంది.

తాత్త్వికులకు, సత్యాన్ని మించిన అందం లేదు.

దేని అందం దానిదే.

నిరలంకారమూ, విశేష సౌందర్యమే!

పొందిన అందాన్ని, పోగొట్టుకునేవారే ఎక్కువమంది.

మేధా దృష్టి ప్రారంభమైందా – సౌందర్య దృష్టి అడుగంటుతుంది.

సౌందర్య దృష్టి ఆరంభమైందా– అసంతృప్తి వెన్నంటి పీడిస్తుంది.

సౌందర్యదృష్టి ఉండాలేకాని, అణువణువునా అందాలే.

సౌందర్యరాహిత్యం, ఆత్మన్యూనతని కలిగిస్తుంది.

## అకారణం

మనకు తెలియకపోవచ్చుకాని, ఏదీ అకారణంగా జరగదు.

## అక్రమసంబంధం

అక్రమసంబంధాల్ని పెట్టుకునేవారు, సక్రమసమాజాన్ని నెలకొల్పలేరు.